ప్రజాశక్తి
సోమవారం 4 నవంబర్ 2024 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా

భర్తీ ఎప్పుడో..?

- విజయవాడలో పారిశుధ్యం అస్తవ్యస్తం
- 1490 మంది పర్మినెంట్ కార్మికులకు 450కి కుదింపు
- అదనపు భారంతో కార్మికులు ఉక్కిరిబిక్కిరి
- బెడిసికొడుతున్న ప్రభుత్వ ప్రయోగాలు

విజయవాడ నగరంలో పారిశుధ్య నిర్వహణపై ప్రభుత్వానికి, నగరపాలక సంస్థకు చిత్తశుద్ధి కొరవడింది. పెరిగిన పని భారానికి అనుగుణంగా పారిశుధ్య కార్మికుల భర్తీ లేదు. మృతిచెందిన, ఉద్యోగ విరమణ పొందిన వారి స్థానంలో కార్మికులను తీసుకుంటున్న పరిస్థితి లేదు. గతంలో ఉన్న పనికి రెండింతలు పెరిగినా... ఏడాదికేడాదికి కార్మికులు కుదించుకుపోతున్నా... ప్రభుత్వానికి, విఎంసిలోని పాలకవర్గానికి కార్మికుల భర్తీపై శ్రద్ధ లేకుండా పోయింది.

... పూర్తి కథనం 2లో

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ లక్ష్మీషా

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ జి.లక్ష్మీషాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర మెడికల్ సర్వీసెస్ అండ్ మౌలిక వనరుల అభివృద్ధి కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గా పని చేస్తున్న ఆయన్ను ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేసింది. లక్ష్మీషా ఐఎఎస్‌గా తొలి పోస్టింగ్ ఉమ్మడి కృష్ణాజిల్లా నూజివీడు సబ్‌కలెక్టర్‌గా పని చేశారు. దీంతో ఆయనకు నూజివీడు, మైలవరం నియోజకవర్గాలపై అవగాహన ఉంది. తిరుపతి జిల్లా కలెక్టర్‌గా పని చేశారు. మొన్నటి వరకు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌గా పని చేసిన డాక్టర్ జి.సృజనను తెలంగాణకు కేటాయించారు.

ఇన్‌ఛార్జి మంత్రికి సమస్యల స్వాగతం

- నేడు ప్రజాప్రతినిధులు, అధికారులతో వాసంశెట్టి సుభాష్ సమీక్ష
- కృష్ణాజిల్లాలో పేరుకుపోయిన సమస్యలు, అంతర్గత విభేధాలు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

కృష్ణాజిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర కార్మిక సంక్షేమ, ఫ్యాక్టరీలు, బాయిలర్లు, బీమా వైద్యసేవల మంత్రి వాసంశెట్టి సుభాష్ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా సోమవారం జిల్లా కేంద్రం మచిలీపట్నానికి వస్తున్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. వ్యవసాయ ప్రధానమైన కృష్ణాజిల్లాలో ఇటీవల రైతాంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి. భారీ వర్షాలు, వరదలకు వివిధ ప్రాంతాల్లో లక్ష ఎకరాలకుపైగా ఖరీఫ్ పంటలు ముంపుకు గురయ్యాయి. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో వేసవిలో కాలువలు, డ్రెయిన్ల మరమ్మతులు పూర్తి చేసేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాల్సి ఉంది. జిల్లాలో నవంబర్ రెండో వారం నుంచి ఖరీఫ్ ధాన్యం మార్కెట్‌లోకి రానుంది. ఈ ఏడాది రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో 9 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారుల అంచనా. ఈ నేపథ్యంలో ధాన్యం విక్రయాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. రబీలో దాళ్వాసాగుకు నీటి విడుదలపై ప్రభుత్వం ప్రకటన చేయాలని పెడన నియోజకవర్గంలోని పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన రైతాంగం అధికారులకు వినతులు ఇస్తోంది. రబీలో అపరాలు పండని భూములున్న మచిలీపట్నం, అవనిగడ్డ నియోజకవర్గాల్లోని రైతులు దాళ్వాసాగుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఆర్ అండ్‌బి రోడ్లపై ఉన్న గుంతల పూడ్చివేతను సంక్రాంతికి పూర్తి చేయడానికి అధికారులకు మార్గనిర్దేశం చేయాల్సి ఉంది. ఎపిఐఐసి మల్లవల్లి మోడల్ ఇండస్ట్రీయల్ పార్కులో ఇటీవల 300కుపైగా పరిశ్రమల ఏర్పాటుకు ఎకరా రూ.16 లక్షలకే చౌకగా భూములు కేటాయించారు. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించాల్సి ఉంది. మచిలీపట్నంలో పోర్టు, ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణంలో జాప్యం జరగకుండా పనులు సకాలంలో పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సామాజిక పింఛన్లు, ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ తీరు, ఉచిత (మిగతా 2లో)

5.75 లక్షల మందికి ఉచిత గ్యాస్

- ఏడాదికి 17.25 లక్షల సిలిండర్లు సరఫరా
- గ్యాస్ కంపెనీలకు ప్రతి ఏటా రూ.146.62 కోట్లు జమ
- రేషన్ బియ్యం అమ్మడం, కొనడం నేరం
- ఎన్‌టిఆర్ జిల్లా డిఎస్‌ఒ పాపారావు

ప్రజాశక్తి-విజయవాడ

తెల్లరేషన్ కార్డున్న ప్రతి ఒక్క కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు చొప్పున ఎన్‌టిఆర్ జిల్లాలోని 5.75 తెల్లరేషన్ కార్డుదారులకు పంపిణీ చేయడం వల్ల గ్యాస్ కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.146.62 కోట్లు చెల్లించాల్సి వస్తోందని ఎన్‌టిఆర్ జిల్లా సివిల్ సప్లై అధికారి (డిఎస్‌ఒ) ఎ.పాపారావు తెలిపారు. ఏడాదికి 17.25 లక్షల సిలిండర్లు లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉంటుందని వివరించారు. ఉచిత గ్యాస్, రేషన్ సరఫరా తీరుపై డిఎస్‌ఒ 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ప్రశ్న: ఎన్‌టిఆర్ జిల్లాలో రేషన్ పంపిణీ తీరు ఎలా ఉంది?

జవాబు: ఎన్‌టిఆర్ జిల్లాలో ఉన్న 5.75 లక్షల తెల్ల రేషన్ కార్డుల ద్వారా ఎనిమిది వేల మెట్రిక్ టన్నుల బియ్యం లబ్దిదారులకు ప్రతి నెలా పంపిణీ జరుగుతుంది. ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి డీలర్లు తీసుకొచ్చిన బియ్యాన్ని మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్స్‌కు అందజేస్తారు. (మిగతా 2లో)

సంక్రాంతి నాటికి గుంతల్లేని రోడ్లు

- మంత్రి కొల్లు రవీంద్ర

మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

సంక్రాంతి నాటికి రోడ్లపై గుంతలన్నీ పూడ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రూ.3 కోట్లతో సోమవారం జిల్లా ఇన్చార్జి మంత్రి, ఎంపి, కూటమి నాయకులతో కలిసి గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. స్థానిక టిడిపి కార్యాలయంలో కూటమి నాయకులతో కలిసి మంత్రి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లో జవాబుదారీ, పారదర్శక అభివృద్ధి లక్ష్యంగా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి పని చేస్తుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇవ్వని విధంగా నెలకు నాలుగు వేల రూపాయల చొప్పున ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ హామీల అమల్లో భాగంగా మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. రోడ్లపై గుంతలు పూడ్చడానికి రూ.360 కోట్లు మంజూరు చేసి, ఇప్పటికే గుంతలు పూడ్చే పనులకు సిఎం శ్రీకారం చుట్టారని తెలిపారు. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఉపాధి హామీ కింద చేపట్టిన పనులను కూడా సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామన్నారు. (మిగతా 2లో)

ప్రజా గొంతుక పిడిఎఫ్‌ను గెలిపించండి

కెఎస్ లక్ష్మణరావుకు వివిధ సంఘాల మద్దతు

ప్రజాశక్తి-గుంటూరు: కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఎన్నికల్లో పిడిఎఫ్ తరపున ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, ప్రజా సంఘాల మద్దతుతో పోటీ చేస్తున్న తనను గెలిపించాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. ఆదివారం గుంటూరు అరండల్‌పేటలోని గీతా రీజెన్సీలో లక్ష్మణరావు అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ వివిధ సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ 2007లో శాసన మండలి పునరుద్ధరించిన తర్వాత ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల నుండి గెలుపొందిన ఏడుగురు ఎమ్మెల్సీలు పిడిఎఫ్‌గా ఏర్పడి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, ఇతర ప్రజా సమస్యలపై పనిచేసినట్లు తెలిపారు. అప్పటి నుండి 2024 వరకూ 13 మంది పిడిఎఫ్ తరపున గెలుపొంది నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తున్నట్లు చెప్పారు. ఏ ప్రభుత్వం ఉన్నా ప్రజల సమస్యలను మండలిలో ప్రస్తావిస్తూ పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు, కౌలు రైతులు, మహిళలు, ఉపాధ్యాయ, పెన్షనర్లు మొదలైన వారి సమస్యల పరిష్కారానికి మండలిలో, వెలుపలా నిరంతర పోరాడుతున్నామన్నారు. రాజ్యాంగ నిర్మాతలు ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ స్థానాలను ప్రత్యేక లక్ష్యంతో ఏర్పాటు చేశారని, ఆ లక్ష్యం దెబ్బతినే విధంగా కొన్ని రాజకీయ పార్టీలు ప్రవర్తిస్తున్నాయని అన్నారు. ఈ ఎన్నికల్లో తనకు అనేక తరగతుల ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారన్నారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ యం.హనుమంతరావు, జిల్లా కార్యదర్శి కళాధర్, సిఐటియు నాయకులు దండా లక్ష్మీనారాయణ, ఇన్సూరెన్స్ ఉద్యోగుల నాయకులు వివికె.సురేష్, ఐలు నాయకులు నర్రా శ్రీనివాసరావు, బ్యాంకు ఉద్యోగుల నాయకుల సాంబశివరావు, ఎల్ఐసి ఏజెంట్స్ యూనియన్ నాయకులు గాంధీ రామ్మోహనరావు, (మిగతా 2లో)

అభివాదం తెలియజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ప్రజాసంఘాల నాయకులు

భర్తీ ఎప్పుడో..?

- విజయవాడలో పారిశుధ్యం అస్తవ్యస్తం
- 1490 మంది పర్మినెంట్ కార్మికులకు 450కి కుదింపు
- అదనపు భారంతో కార్మికులు ఉక్కిరిబిక్కిరి
- బెడిసికొడుతున్న ప్రభుత్వ ప్రయోగాలు

విజయవాడలో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగరంలో పారిశుధ్య నిర్వహణపై ప్రభుత్వానికి, నగరపాలక సంస్థకు చిత్తశుద్ధి కొరవడింది. పెరిగిన పని భారానికి అనుగుణంగా పారిశుధ్య కార్మికుల భర్తీ లేదు. మృతిచెందిన, ఉద్యోగ విరమణ పొందిన వారి స్థానంలో కార్మికులను తీసుకుంటున్న పరిస్థితి లేదు. గతంలో ఉన్న పనికి రెండింతలు పెరిగినా.... ఏడాదికేడాదికి కార్మికులు కుదించుకుపోతున్నా... ప్రభుత్వానికి, విఎంసిలోని పాలకవర్గానికి కార్మికుల భర్తీపై శ్రద్ధ లేకుండా పోయింది. అరకొరగా ఉన్న కార్మికుల్లో కొంత మందిని ప్రజారోగ్య విభాగానికి, సంబంధం లేని వేరే పనులకు మళ్లించారు. దీంతో డివిజన్లలో పని చేయాల్సిన కార్మికులపై అదనపు భారం పడుతుంది. వీధుల స్వీపింగ్, డ్రైయిన్ల క్లీనింగ్ పూర్తిస్థాయిలో జరగడం లేదు. 120కి పైగా ఉన్న మురికివాడలు, కొండ ప్రాంతాలు, కాలువగట్లు, డ్రైయిన్ల పక్కన నివాసాల్లో పారిశుధ్య నిర్వహణ ఊసేలేకుండా పోయింది. ఈ పరిస్థితి విజయవాడలో గత పదేళ్ల నుంచి చోటుచేసుకుంది. ఫలితంగా పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులు, అనుభవాలు, కౌన్సిల్‌లో సభ్యుల వాదన ప్రకారం వెయ్యి నుంచి 1500 మంది కార్మికులు అవసరమని ఏళ్ల తరబడి డిమాండ్ వినిపిస్తుంది. కార్మికుల భర్తీ అంశాన్ని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు ప్రతి కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావిస్తూనే ఉన్నారు. అయినా నేటికీ అటు వైసిపికానీ, ఇటు టిడిపికానీ కార్మికుల భర్తీ అంశంలో మీనమేషాలు లెక్కిస్తున్నాయి. 1490 మంది పర్మినెంట్ కార్మికులకు ప్రస్తుతం కేవలం 450 మంది మాత్రమే ఉన్నారు. ఆప్కాస్ కార్మికులు మరో 3,454 మంది పని చేస్తున్నారు. 2010 నుంచి కార్మికుల భర్తీని నిలిపివేశారు. 14 ఏళ్ల నుంచి వందల మంది పర్మినెంట్ కార్మికులు రిటైర్మెంట్ అయినా, మృతిచెందినా వారి స్థానంలో ఒక్క కార్మికుడిని కూడా భర్తీ చేసుకోలేదు. మరోవైపున పారిశుధ్య నిర్వహణలో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాల్సిన అత్యంత కీలకమైన ఇన్‌స్పెక్టర్లు సగానికి సగం మంది అనర్హులే ఉన్నారు. ప్రస్తుతం ప్రజారోగ్య విభాగం ముఖ్య అధికారి (సిఎంఒహెచ్) పూర్తి స్థాయి అధికారి లేకపోగా, ఉన్న ఇన్‌ఛార్జీ అధికారి సైతం అర్హులు కాదు. మూడు సర్కిళ్ల పరిధిలో ప్రజారోగ్య విభాగంలో అదనపు అధికారుల్లో (ఎఎంఒహెచ్) ఏ ఒక్కరూ కూడా అర్హత కలిగిన వారు కాదు. శానిటరీ సూపర్‌వైజర్లు ఆరుగురిలో కూడా ఇటీవల ఒకరు ఉద్యోగ విరమణ చేశారు. ఆ పోస్టు భర్తీ లేదు.

విఫలమవుతున్న ప్రభుత్వ ప్రయోగాలు

పారిశుధ్య నిర్వహణలో అటు ప్రభుత్వం, ఇటు నగరపలక సంస్థ చేస్తున్న అనేక ప్రయోగాలు ఘోరంగా విఫలమవుతూ పారిశుధ్యం అధ్వానంగా తయారవ్వడమే కాకుండా ఉన్న కార్మికులపై పని భారం తప్పడం లేదు. మరోక వైపున ఖర్చు తగ్గింపు పేరుతో పూర్తి స్థాయిలో కార్మికులను భర్తీ చేయకుండా ఆయా ప్రత్యేక సందర్భాలు, పండుగల సీజన్‌ల్లో కాంట్రాక్టర్ల ద్వారా రోజువారీ కార్మికులతో పని చేయిస్తున్నారు. కాంట్రాక్టర్లు, మధ్య దళారుల జేబులు నింపడానికి పాలకవర్గం శ్రద్ధ చూపుతుంది. పాత పద్ధతి స్థానంలో తీసుకొచ్చిన మైక్రోప్యాకెట్ (300 గృహాలు)కు మూడు నుంచి నలుగురు కార్మికులను కేటాయించి, పని చేయించాలని తీసుకొచ్చిన విధానం ఆచరణలో విఫలమైంది. ప్రస్తుతం కార్మికుల కొరతతో రెండున్నర నుంచి ముగ్గురు కార్మికులతోనే మైక్రోప్యాకెట్ పరిధిలో పని చేయిస్తున్నారు. దీని వల్ల కార్మికులపై అదనపు భారం పడింది. కృష్ణలంక 22వ డివిజన్‌లో 70 మందికి పైగా కార్మికులు గతంలో పని చేయగా, ప్రస్తుతం 42 మంది మాత్రమే ఉన్నారు. అలాగే 21వ డివిజన్‌లో 85 మందికి 50 మంది మాత్రమే రికార్డుల్లో ఉన్నారు. మధ్య నియోజకవర్గంలోని 36వ డివిజన్‌లో గతంలో 100 మందికి పైగా కార్మికులు ఉండగా, ప్రస్తుతం 75 మంది లోపే కార్మికులున్నారు. వీరిలో కూడా అనారోగ్య సమస్యలు, ఇతర కారణాల వల్ల ఐదారుగురు నిత్యం గైర్హాజరవుతుంటారు. మైక్రోప్యాకెట్ పరిధిలో స్వీపింగ్ దగ్గర నుంచి డ్రైయిన్ క్లీనింగ్, పోగుల ఎత్తేయడం, ప్రధాన రహదారుల్లో స్వీపింగ్, ఇవి చాలవన్నట్లు ఇతర అనేక రకాల పనులు చేయిస్తూ ఉదయం ఐదు గంటలకు పనిలోకి వచ్చిన కార్మికుడు మధ్యాహ్నం 12 గంటలకు కూడా పనిలో నుంచి బయటపడలేని వైనం నెలకొంది. మరలా వెంటనే మూడు గంటలకు పనిలోకి రావాల్సి ఉంది. దీని వల్ల పని భారం పెరిగిపోయి, కార్మికులు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు. మురుగు, ఇతర వ్యర్థాలు, దుమ్ము, ధూళిలో నిత్యం పని చేయాల్సి వస్తుండటంతో అతి తక్కువ వయసులోనే నడుములు, మోకాళ్ల నొప్పులు, జీర్ణకోశవ్యాధులు, ఉబ్బసం తదితర దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతూ కార్మికులు మృత్యువాతపడుతున్నారు. అయినా వారి కుటుంబాలను ఆదుకుంటున్న పరిస్థితి లేకుండా పోయింది. పని ప్రదేశాల్లోనే ప్రమాదాలకు గురై ఇటీవల కాలంలోనే అనేక మంది కార్మికులు మృత్యువాతపడ్డారు. గత వారం, పది రోజుల వ్యవధిలోనే రోడ్డు ప్రమాదాలు జరిగి విధుల్లో ఉన్న ఇద్దరు కార్మికులు మృత్యువాతపడ్డారు.

అసలు కన్నా కొసరు ఎక్కువ

విఎంసికి ఎటువంటి సంబంధం లేని వేరే పనులకు కార్మికులను వినియోగించాల్సి వస్తోంది. డ్రైయిన్లలో సిల్టు తొలగింపు, నైట్ శానిటేషన్, బందర్ రోడ్డు, ఏలూరు రోడ్డు తదితర ప్రధాన రహదారుల్లో మాపింగ్ పని, వెహికల్ డిపో, రామవరప్పాడు నుంచి ఎయిర్‌పోర్టు వరకు రహదారుల మధ్య స్వీపింగ్ ఇలా విఎంసికి సంబంధం లేని పనులకు ఐదారు వందల మందిని నిత్యం వినియోగించాల్సి రావడంతో ఉన్న కొద్ది పాటి కార్మికులపై అదనపు పని భారం పడుతుందని, ఫలితంగా శానిటేషన్ పూర్తి స్థాయిలో కావడం లేదని ప్రజారోగ్య విభాగం అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా కార్మికులను భర్తీ చేసి, పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని నగర వాసులు, పౌర సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

మొదటిపేజీ తరువాయి

5.75 లక్షల మందికి ఉచిత గ్యాస్

అక్కడి నుంచి ప్రతి డివిజన్‌లో వీధివీధికి తిరుగుతూ ఇళ్ల వద్దనే మొబైల్ వ్యాన్ ద్వారా బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార పంపిణీ చేస్తున్నారు. ఎన్‌టిఆర్ జిల్లాలో 374 మొబైల్ వాహనాలు పని చేస్తుండగా, 954 మంది డీలర్లు ఉన్నారు. ప్రతి కార్డుదారుడికి కిలో కందిపప్పు చొప్పున (రూ.67) 570 టన్నులు, అలాగే అర కిలో పంచదార చొప్పున (రూ.17) 272 టన్నులు లబ్దిదారులకు ప్రతి నెలా పంపిణీ జరుగుతుంది. ఈ ప్రాంతంలో బియ్యం పంపిణీ చేసినట్లుగా రాయలసీమలో రాగులు పంపిణీ చేస్తున్నారు.

ప్రశ్న: రేషన్ అక్రమ రవాణాపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: రేషన్ బియ్యం అమ్మడం, కొనడం చట్టనీత్యా నేరం. అక్కడక్కడా కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయకుండా కిలోకి ఇంత అని డబ్బులు ఇస్తూ బియ్యం మిగుల్చుకుంటున్నట్లు సమాచారం అందుతుంది. దీనిపై సమగ్రంగా విచారిస్తూ కేసులు కూడా నమోదు చేస్తున్నాం. అక్రమంగా బియ్యం అమ్ముతున్న వారిపై నెలకు 30 నుంచి 40 చొప్పున కేసులు కూడా నమోదవుతున్నాయి. ఇలా 150 మందిపై కేసులు నమోదయ్యాయి. విజయవాడ నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా సివిల్‌సప్లై అధికారులు నిత్యం నిఘా పెంచి బియ్యంను అమ్మినా వాటిని కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రతి కార్డుదారుడికి బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు పంపిణీ చేయాలి. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవు.

ప్రశ్న: తెల్లరేషన్ కార్డుల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

జవాబు: రేషన్‌కార్డుల మంజూరు నిరంతరం జరుగుతున్న ప్రక్రియ. అర్హులయిన ప్రతి ఒక్కరికీ కార్డు మంజూరు చేయడం జరుగుతుంది. ప్రతి సచివాలయం పరిధిలో కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే అటువంటి వాటిని సంబంధిత తహశీల్దార్ పరిశీలించి, కార్డులు మంజూరు చేయడం జరుగుతుంది. జిల్లాలో దాదాపుగా అర్హులయిన ప్రతి ఒక్కరికీ కార్డులున్నాయి. ఎవరికైనా కార్డు లేదనుకుంటే ఈ ప్రభుత్వం నిర్దేశించిన కాలంలో వాటిని సంబందిత తహశీల్దార్ల ద్వారా మంజూరు చేయడం జరుగుతుంది.

ప్రజా గొంతుక పిడిఎఫ్‌ను గెలిపించండి

కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం నాయకులు ఆర్.స్వాతి, సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు కె.అనురాధ, మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల సంఘం నాయకులు ముత్యాలరావు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ జెఎసి నాయకులు బి.లక్ష్మణరావు, అంగన్‌వాడీ నాయకులు చిన్నవెంకాయమ్మ, విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు నాగబ్రహ్మాచారి, 108 ఉద్యోగుల సంఘాల నాయకులు బాబు, నర్సింగ్ అసోసియేషన్ నాయకులు స్వచ్ఛంద ప్రసాద్ తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు. ప్రజల గళాన్ని మండలిలో వినిపించటానికి పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వారు పిలుపునిచ్చారు.

సంక్రాంతి నాటికి గుంతల్లేని రోడ్లు

మచిలీపట్నం అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తెస్తున్నామని, రు.30 కోట్లు ఉపాధి హామీ నిధులతో రెండేళ్లలో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని, 15వ ఆర్థిక సంఘం కింద మంజూరైన రూ.5 కోట్లతో మున్సిపాల్టీలో డ్రైన్లు, పార్కుల అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. డిస్ట్రిక్ మైనింగ్ ఫండ్ కింద మరో రూ.30 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. 2025 నాటికి పూర్తయ్యేలా బందరు పోర్టు పనులు జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ బాబాప్రసాద్, బండి రామకృష్ణ, గొర్రెపాటి గోపీచంద్, లంకె నారాయణప్రసాద్, ఇలియాస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి మంత్రికి సమస్యల స్వాగతం

ఇసుక ఎంత మేరకు అందుబాటులోకి తీసుకు రావడానికి జిల్లా అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు ఏ మేరకు ఫలితాలిస్తోందనే అంశంపైన సమీక్షించాల్సి ఉంది. మరోపక్క కూటమి నేతల్లో విభేధాలు బహిర్గతమవుతున్నాయి. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులుపై గన్నవరం ఎంఎల్‌ఎ యార్లగడ్డ వెంకట్రావు చేసిన ఆరోపణలు, గుడివాడ నియోజకవర్గంలోని నందివాడ మండలంలో సొంత పార్టీ సర్పంచ్‌ను సిమెంట్ రోడ్డు శంకుస్థాపనకు ఆహ్వానించకపోవడం తదితర అంశాలు వెలుగు చూశాయి. ప్రజా సమస్యలు, పార్టీలో అంతర్గత విబేధాలు పరిష్కారానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సుభాష్ ఎటువంటి పరిష్కారం చూపుతారనేది ఆసక్తికరంగా మారింది.

పర్యటన వివరాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కృష్ణాజిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం మచిలీపట్నంలో పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంతలకు బస్టాండ్ సెంటర్లో ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. ఉదయం 11 గంటలకు గాంధీ విద్యాలయం, బలరామునిపేటలో యాదవ కళ్యాణమండపం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. 11.30 గంటలకు ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ హాలులో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. 4.30 గంటలకు గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని శివగంగ టెంపుల్, కాలే ఖాన్ పేట, మచిలీపట్నం నుండి కోన వెళ్లే రోడ్డు (వయా కమ్మవారిచెరువు) నుండి ప్రారంభిస్తారు. సాయంత్రం 5 గంటలకు వాడపాలెంలో వంగవీటి రంగా విగ్రహం ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.

ఇసుక అక్రమ రవాణాపై నిఘా : సిపి

ప్రజాశక్తి-విజయవాడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పాలసీని సామాన్య ప్రజలకు అందకుండా దళారులు అక్రమంగా దారి మళ్లించి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని, అధిక ధరలకు అమ్ముతున్నారని వచ్చిన సమాచారం మేరకు సామాన్య ప్రజలకు ఇసుక అందేలా చూడాలని నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖరబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు ఏర్పాటు చేయడంతో పాటు 17 చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేశారు. ఈ బృందాలతో పాటు సాంకేతికతను ఆధారంగా చేసుకుంటూ డ్రోన్ కెమెరాల ద్వారా, స్టాక్ యార్డుల వద్ద, చెక్ పోస్ట్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. టిప్పర్లకు ఏర్పాటు చేసిన జిపిఎస్‌లను కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేసి ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందిస్తామన్నారు. ఇసుక అక్రమంగా నిల్వ ఉంచకుండా, తరలించకుండా ఉండే విధంగా అధికారులకు పలు సూచనలు చేశారు. గడిచిన ఈ మూడు నెలల కాలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై 100 కేసులు నమోదు చేసి, 150 వాహనాలను సీజ్ చేశామన్నారు. 195 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 2,125 టన్నుల అక్రమ ఇసుకను స్వాధీనం చేసుకొని రూ.2.18 లక్షలు జరిమానా విధించామన్నారు. అనధికారికంగా ఇసుక డంప్‌లను నిల్వ ఉంచినా, అక్రమంగా తరలించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సిపి హెచ్చరించారు.

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-అవనిగడ్డ : నాగాయలంక, కోడూరు, అవనిగడ్డ మండలాల్లో ఆదివారం అక్రమ మద్యం కలిగి ఉన్న వారిపై ఆకస్మిక దాడులు చేసి మూడు కేసుల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జయవాడకు చెందిన ఎన్ఫోర్స్మెంట్ ఎస్సై ఎం రామశేషయ్య తెలిపారు. అవనిగడ్డ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మొత్తం మూడు మండలాల్లో 1977 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహించినా, అక్రమ మద్యం కలిగి ఉన్నా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కనపర్తిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ బ్యానర్లను దగ్ధం చేసినందుకు అవనిగడ్డ పోలీస్ స్టేషన్ వద్ద డిఎస్పి మురళీధర్ పోలీస్ సిబ్బంది సమక్షంలో గౌతంపై ఫిర్యాదు చేస్తూ నోటికి వచ్చినట్లు బూతులు తిట్టారని అవసరమైతే భౌతిక దాడులు జరుగుతాయని రెచ్చిపోయి మాట్లాడిన టిడిపి నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాస్పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని గౌతమ్ అవనిగడ్డ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.అలాగే కనపర్తి శ్రీనివాసరావు పై కోటి రూపాయలకు పరువు నష్టం కేసు వేయనున్నట్లు ప్రముఖ న్యాయవాది బడే శేషగిరిరావు తెలిపారు. గౌతం తండ్రి అయిన శేషగిరిరావు ఆదివారం ఆయన తన కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ తన కుమారుడు గౌతమ్ పై అవనిగడ్డ డిఎస్పి పోలీస్ సిబ్బంది ఎదుట ఫిర్యాదు చేసి ఉన్మాదిలా ప్రవర్తించారని, అసభ్య పదజాలంతో బూతులు తిట్టారని కనపర్తి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనియెడల కనపర్తి శ్రీనివాసరావుపై కోటి రూపాయలకు పరువు నష్టం కేసు దాఖలు చేయనున్నట్లు చెప్పారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రభుత్వాలు ఎన్ని ప్రకటనలు చేసినా ఎన్ని హెచ్చరికలు చేసినా ఇసుక బకాసురుల తీరు మారటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. శని, ఆదివారలు సెలవు రోజులు కావడంతో ఇసుకాసురులు మరింత బరి తెగిస్తున్నారు. నదీ తీర ప్రాంతం లో నదీ గర్భం లోని ఇసుకను తోడేస్తున్నారు. చల్లపల్లి మండలం సి ఆర్ జడ్ పరిధిలో ఉందని ఇసుక తవ్వ కాలకు మండల పరిధిలో అనుమతులు లేవని తహసీల్దార్ గత నెల 24న మీడియా సమావేశంలో వెల్లడించారు. సి ఆర్ జడ్ పరిధిలో చల్లపల్లి మండల సి ఆర్ జెడ్ పరిధిలో ఉన్నా, ఏపీ హై కోర్ట్ ఆదేశాలు ఉన్నప్పటికీ నిమ్మగడ్డ, నడుకుదురు నదీ తీరంలో యథేచ్ఛగా ఇసుక రవాణా జరగడం అధికారుల విధి నిర్వహణ తీరు తెలియజేస్తోం దని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అవసరమైన వారు గ్రామ సచివాలయంలో అనుమతి తీసుకోవాలని నిబంధనలను చెప్తున్నా ఏ ఒక్కరు అనుమతి తీసుకోకుండా రవాణా చేస్తున్నారు. నిత్యం లంకపల్లి నుండి చల్లపల్లి వరకు యథచ్ఛగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను తనిఖీ చేయవలసిన అధికారులు తనిఖీ నిర్వహించకపోవడం ఇసుక అక్రమాసురులు ఇష్టరాజ్యంగా తోడేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాతో పాడవుతున్న రోడ్లు

ఆన్లైన్ డేటా పూర్తి చేయాలి

- కృష్ణాజిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటనారాయణ

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటనారాయణ

ప్రజాశక్తి - గుడివాడ : మెప్మాలో ఎస్హెచ్జి డేటా ప్యూరిఫికేషన్ ఈ నెల 7వ తేదిలోపు ఆన్లైన్ చేసి డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేయాలని జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక కైకాల సత్యనారాయణ పురపాలక కళా మందిరంలో ఎస్హెచ్జి ప్రొఫైలింగ్ యాప్ను మంత్రి పి.నారాయణ, రాష్ట్ర మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్భరత్ అన్లైన్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 5 మున్సిపాలిటీలకు సంబంధించిన డ్వాక్రా సంఘాలకు మెప్మా యాప్కు సంబంధించిన శిక్షణా తరగతులను జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో అన్లైన్ ద్వారా ప్రతి డ్వాక్రా సభ్యుల వివరాలను పొందు పరచి, నేరుగా వ్యాపారాలు నిర్వహించేందుకు ఇలాంటి యాప్లను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ నెల 7వ తేది లోపు ప్రతి గ్రూపు యాప్లో వారి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు వల్ల డ్వాక్రా సంఘాలు మరింత బలోపేతం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎంయు సిబ్బంది, సిఎంఎంలు, సివోలు, ఆర్పిలు, డిఈవోలు పాల్గొన్నారు.

వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ : అవినీతిని వ్యతిరేకించండి.. దేశం అభివద్ధికి కట్టుబడి ఉండండి అని లేడీ యాంప్తిల్ కళాశాల ప్రిన్సిపాల్ వి సుందరలక్ష్మి అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ వారు విజిలెన్స్ వారోత్సవాలు ముగింపు సందర్భంగా మచిలీపట్నం లోని లేడీ యాంప్తిల్ కళాశాలలో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్ కంపెనీ విజిలెన్స్ అధికారి కె శ్రీధరబాబు మాట్లాడుతు సమాజంలో విద్యార్థులు అవినీతి సమస్యలు, అవినీతి కి వ్యతిరేకం గా పోరాడాలని, సమాజం పట్ల బాధ్యతతో మెలగాలన్నారు. పోటీలు అనంతరం విద్యార్థులతో అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరనాథ్ బాబు అధ్యాపకులు మమత, హిరణ్మయి, శ్రీనివాస్ బెల్ విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై సత్యనారాయణ

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ట్రాఫిక్ నిబంధనలు ప్రతి వాహన దారుడు పాటించాలని గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ కోరారు. నిబంధనలకు వ్యతిరేకంగా వాహనాలను నడుపుతున్న వారిపై స్థానిక ప్రధాన సెంటర్లో ఆదివారం ఫైన్లు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించి వాహనాలు నడిపితే ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు ఆర్సి, ఇన్సూరెన్స్, పొల్యూషన్ పత్రాలు తప్పక కలిగి ఉండాలని తెలిపారు. ఏఎస్ఐ మెండు. సాంబశివరావు, సిబ్బంది ఉన్నారు.

ఆలపాటి రాజాకు పరామర్శ

ప్రజాశక్తి - గుడివాడ : మాజీ మంత్రి, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ను మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఆదివారం గుంటూరులోని మాజీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తల్లి ఆలపాటి వనజాక్షి ఇటీవల మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆలపాటి రాజా, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.



మాజీ మంత్రి ఆలపాటిని పరామర్శిస్తున్న రావి

వెండి నాగపడగ బహూకరణ

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి సూర్యారావుపేటకు చెందిన మాకినేని వెంకట విజయ కుమార్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. 950 గ్రాములు బరువు కలిగిన వెండి నాగ పడగ స్వామివారికి కానుకగా ఆలయ ఉపకమిషనర్ కార్య నిర్వహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావుకి అందజేశారు. దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

వెండి నాగపడగ బహూకరిస్తున్న దృశ్యం

నిధుల మంజూరు పట్ల హర్షం

ప్రజాశక్తి - గుడివాడ : 20 ఏళ్లుగా అపరిష్కతంగా ఉన్న ధనియాలపేట అభివృద్ధికి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చిత్ర పటానికి ధనియాలపేట పెద్దలు పాలాభిషేకం చేశారు. ఆదివారం 30వ వార్డు పరిధిలోని ధనియాలపేటలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కషితో మూడు కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేసి క్షీరాభిషేకం చేశారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, వార్డు పెద్దలు పాల్గొన్నారు.

అధ్వానంగా కొత్తగూడెం రోడ్డు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం కొత్తగూడెం నుంచి వీరపనేనిగూడెం, చిక్కవరం గ్రామాలకు వెళ్ళే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైంది. రాత్రిళు ఈ రోడ్డుపై ప్రయాణం నరకాన్ని చూపిస్తోంది. దాదాపు దశాబ్దం క్రితం జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ఈరహదారిని అభివద్ధి పరిచారు. ఐదేళ్లకు రోడ్డు పాక్షికంగా దెబ్బతింది. ట్రాక్టర్ల తాకిడికి అవి రాళు తేలి గోతులు పెద్దవిగా మారాయి. ఈ రహదారిపై ప్రయాణం ప్రమాదకంగా మారిందని వాహనదారులు అంటున్నారు. ఇక రైతుల బాధలు పర్ణాతీతం. కొత్తగూడెం , చిక్కవరం , వీరపనేనిగూడెం గ్రామాల మధ్య పది కిలో మీటర్ల దూరం ఉంటుంది. రహదారికి ఇరువైపులా పంట పొలాలు ఉన్నాయి. దాదాపు రెండు వేల ఎకరాలలో వరి, అపరాలు , చెరుకు సాగవుతోంది . నిత్యం రైతులు పొలాలకు వెళ్తారు . రోడ్డంతా గోతులు పడటంతో నడవటానికి అగచాట్లు పడుతున్నారు. ద్విచక్ర వాహనంపై వెళితే ఎక్కడ పడిపోతామో అన్న భయం వారిలో నెలకొంది. దీంతో చాలా మంది కష్టమైనా నడచి వెళ్తున్నారు. ఈరహదారికి మోక్షం లేదని మదన పడుతున్నారు . కొత్తగూడెం చెరువు మలుపు పూర్తిగా కొసుకుపోయింది. ఎవరైనా ఆదమరిస్తే చెరువులోకి వెళ్లిపోతారు.

అధ్వానంగా ఉన్న రహదారి

జనాల కష్టాలు పట్టడంలేదు: ధర్మారావు

గత పదేళ్లలో ఈరహదారిని బాగు చేయించాలని కోరుతూ స్థానికులు ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు సమర్పించారు. అధికారులకు ఎన్నిసార్లు నివేదించారో చెప్పలేం. అయినా రహదారికి ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరు కాలేదు. కొత్తగూడెం, చిక్కవరం రైతులు, జనాల కష్టాలు ఎవరికీ వినపడటం లేదు.

ప్రభుత్వం స్పందించాలి : ఎలీషారావు,

మూడు గ్రామాలకు ఆధారమైన రహదారి అభివద్ధికి అవసరమైన ని ధుల కేటాయింపుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కాలం గడిచి పోతున్నా సమస్య మాత్రం పరిష్కారం కావటం లేదు. దశాబ్ద కాలం గా నానా అగచాట్లు పడుతున్నాం . చాలా మంది ప్రమాదాల భారిన పడ్డారు . ఆసుపత్రుల్లో వేలాది రూపాయలు ఖర్చు పెట్టారు . ఈపరి స్థితి మారాలంటే రహదారిని కొత్తగా నిర్మించాలి .

దర్శనానికి వచ్చిన సిపి రాజశేఖర బాబు దంపతులు

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం దుర్గమ్మ శ్రీ అమ్మవారి దర్శనార్థం ఆలయానికి పలువురు విచ్చేశారు. కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరపు రామమోహన్ నాయుడు, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, అనకాపల్లి ఎంపి సిఎం రమేష్, మాడుగుల ఎంఎల్ఎ బండారు సత్యనారాయణమూర్తి, ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ ఆదివారం విచ్చేశారు. జిల్లా పోలీస్ కమి షనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు దంపతులు అమ్మవారి దర్శనార్థం ఆలయమునకు విచ్చేశారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించి, వేదపండితులచే వేదాశీర్వచనం కల్పించిన ఆలయ ఇఒ కె.ఎస్.రామరావు వీరికి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇఒతో పాటు డిప్యూటీ ఇఒ ఎం.రత్నరాజు, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో గాజుల మహోత్సవం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దుర్గగుడికి మహామండపం 6వ అంతస్తులో దేవస్థానంలో గాజుల అలంకరణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గాజుల అలంకరణలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు, గాజుల దండలతో అలంకరించిన ఆలయ ప్రాంగణాలు ఉదయం నుండి విశేషంగా ఆకట్టుకున్నాయి. దుర్గమ్మను యాత్రికులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఆదివారం, గాజుల అలంకరణ పురస్కరించుకొని రద్దీ దృష్ట్యా ఆలయ ఇఒ కె ఎస్ రామరావు ఆదేశాల మేరకు అధికారులు తగు ఏర్పాట్లను చేశారు.

జగ్గయ్యపేట ఎస్ఐగా రాజు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట పట్టణ పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా రాజు బాధ్యతలు చేపట్టారు. రాజు ఇప్పటివరకు విజయవాడ సిటీలో విధులు నిర్వహించి బదిలీపై జగ్గయ్యపేట వచ్చారు. ఆయనకు పోలీసు సిబ్బంది ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు.

బిజెపితో ప్రమాదాన్ని గుర్తించడంలో కాంగ్రెస్ విఫలం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - తిరువూరు : ఈ దేశానికి బిజెపి ప్రమాదాన్ని కాంగ్రెస్ పార్టీ గుర్తించటంలో విఫలమవుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు అన్నారు. సిపిఎం తిరువూరు పట్టణ మహాసభ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పి.తులసీరాణి, నారాయణ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ప్రధాన వక్తగా బాబూరావు పాల్గొని మాట్లాడుతూ బిజెపి ఈ దేశానికి ప్రమాదకరమని కాంగ్రెస్ అలా భావించి ఉంటే మూడోసారి కేంద్రంలో బిజెపి వచ్చేది కాదని, బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను కలుపుకుని వెళ్లటంలో కాంగ్రెస్ విఫలమవుతోందని చెప్పారు. డబ్బులు విరజిమ్మి లబ్ధి పొందుతున్నారని, కానీ ప్రజాస్వామ్య వ్యవస్థలో తప్పనిసరిగా పోటీచేస్తున్న కమ్యూనిస్టులకు ఓట్లు, సీట్లు రానంతమాత్రాన నిరాశ చెందాల్సిన అవసరం లేదని పార్టీ కార్యకర్తలకు ఆయన వివరించారు. ఎన్నికల సమయంలో బూర్జువా పార్టీలు అమలు చేయలేని వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వాగ్దానాలు అమలు చేయకపోతే తమ తరుపున ఉద్యమించాలని ప్రజలు కోరుతున్నారంటే కమ్యూనిస్టులను ఆదరించటమేనని బాబూరావు పేర్కొన్నారు. ఈ మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, ఎన్.సిహెచ్.శ్రీనివాస్, మేకల నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మహాసభ ప్రారంభానికి ముందుగా బోసు బొమ్మ సెంటర్లో పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు నూకల సత్య నారాయణ ఆవిష్కరించారు.

మాట్లాడుతున్న సిహెచ్.బాబూరావు

1,120 కోడి కత్తులు స్వాధీనం

ప్రజాశక్తి - మైలవరం, విస్సన్నపేట : రాబోవు సంక్రాంతి పండుగ సందర్భంగా అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉండేందుకు మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో దాడులు చేసి 17మంది కోడి కత్తులు కట్టే వారిని అదుపులోకి తీసుకొని వారి నుండి 1120 కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎసిపి వై.ప్రసాదరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సిఐ చంద్రశేఖర్ నేతృత్వంలో ఆరు ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసామన్నారు. జి.కొండూరు, ఎ.కొండూరు, రెడ్డిగూడెం, విస్సన్నపేట, తిరువూరు మండలాల్లో దాడులు చేసి కోడి కత్తులు తయారు చేసే వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ చంద్రశేఖర్, ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న కోడి కత్తులు

ప్రభుత్వాస్పత్రి సందర్శన

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ డివిఆర్ ఏరియా గవర్నమెంట్ హాస్పిటల్‌ను నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య సందర్శించారు. హాస్పిటల్ అభివృద్ధి, విస్తరణకు సంబంధించి పలు అంశాలపై వైద్యుల బృందంతో చర్చించారు. రోగులకు మెరుగైన సేవలందించాలని వైద్యులకు సూచించారు. మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎల్ఎ సౌమ్య

గుడిమెట్లలో క్షుద్ర పూజల కలకలం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలం గుడిమెట్ల గ్రామంలో వజ్రాల గుట్ట వద్ద క్షుద్ర పూజలు కలకలం కలిగించాయి. మేకను బలిచ్చి గుర్తు తెలియని వ్యక్తులు పూజలు నిర్వహించారు. తమ వ్యాపారం పెరగాలంటూ తెల్లపేపరుపై రాసి పూజలు నిర్వహించారు. తన మూడు మేకలు కనపడటం లేదని మూడు రోజుల నుండి వెతుక్కుంటూ ఈరోజు మేకలు బలిచ్చినట్లు గుర్తించి నాగరాజు అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగరాజు ఫిర్యాదు మేరకు క్షుద్ర పూజలపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్షుద్ర పూజలలో భాగంగా మేకను బలిచ్చిన దృశ్యం

బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాము

ప్రజాశక్తి - మైలవరం : బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షునిగా మైల వరానికి చెందిన తమ్మిశెట్టి రాము ఎన్నికయ్యారు. బిసి సంక్షేమ సంఘం సమావేశం ఆదివారం ఆ సంఘ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు లాక వెంగళరావు యాదవ్ మాట్లాడారు. చట్టసభల్లో, స్థానిక సంస్థల్లో బిసిలకు 50 శాతం కేటాయించాలన్నారు. బిసిలు అణచివేతకు గురవుతున్నారని బిసిల ఐక్యత కోసం రాజ్యాధికారం కోసం అన్ని జిల్లాల్లో నూతన కమిటీలను నియమిస్తున్నామన్నారు. ఉపాధ్యక్షునిగా తోకల సత్యనారాయణకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నియోజకవర్గ బిసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

నియామకపత్రం అందుకుంటున్న రాము

మహిళను ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

కాల్వలో పడిన మహిళను రక్షించిన పోలీసులు

ప్రజాశక్తి - విజయవాడ : స్థానిక కృష్ణలంక పరిధిలో ట్రైన్‌లో ప్రయాణిస్తున్న ఒక మహిళ అనుకోకుండా బ్రిడ్జిపై నుంచి అదుపు తప్పి పక్కనే ఉన్న కాలువలో ఆదివారం జారి పడింది. ఆమె కేకలు విన్న స్థానికులు వెంటనే ఈ ఘటనను కృష్ణలంక పోలీసులకు తెలిపారు. స్పందించిన పోలీసులు అప్రమత్తమై వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ప్రవహిస్తున్న కాలువ ప్రవాహాన్ని ఎదుర్కొంటున్న మహిళను గమనించి, సురక్షితంగా బయటకు తీసుకొచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలి

ప్రజాశక్తి - వన్ టౌన్ : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే దిశగా రాజకీయ పార్టీలు కృషి చేయాలని వాల్మీకి సేవా సంఘం అధ్యక్షులు బరిగె నరసింహారావు తెలిపారు. భీమన వారి పేట మహర్షి వాల్మీకి భవన్‌లో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విజయవాడ వాల్మీకి (బోయ) సేవా సంఘం అధ్యక్షులు బరిగె నరసింహారావు మాట్లాడారు. పశ్చిమ ఎంఎల్ఎ కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, వాల్మీకి (బోయ) సేవా సంఘం ఉపాధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, సెక్రటరీ సిహెచ్.సాంబశివరావు, కోశాధికారి సిహెచ్.వి.వరప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలం, చింతలపాడు గ్రామ శివరులో నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి నలుగుర్ని అరెస్టు చేశారు. వచ్చిన సమాచారం మేరకు సెక్టార్ 2 ఎస్ఐ వి.వెంకటరావు తన సిబ్బందితో వెళ్లి కోడి పందాల శిబిరంపై దాడి చేసి నలుగురు జూద గాళ్లను అదుపులోకి తీసుకుని ఒక కోడి పుంజును, కోడి కత్తిని రూ.7,810లు నగదు, 4 బైకులను స్వాధీనం చేసుకున్నారు. జూదగాళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు

- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-పెడన/గూడూరు : నియోజవర్గ పరిధిలోని గూడూరు మండల పరిధిలో 17 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో గూడూరు వన్, మల్లవోలు, ఆకులమన్నాడు, కోకనారాయణ పాలెం, తలకటూరు సచివాలయాల్లో ఆధార్ సవరణ కేంద్రాలను నియమించారు. కానీ వాటిలోని సిబ్బంది విధులకు గైహాజరవుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే పెడన మండలంలో 17 సచివాలయాలు ఉండగా వీటిలో మండల పరిధిలోని కొంకేపూడి, చెన్నూరు గ్రామాల్లో ఉన్న సచివాలయాల్లోని ఆధార్ కార్డులను సవరణ చేస్తారు. అయితే దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రభుత్వం ఆచరణలో పెట్టింది. ఇందుకు సంబంధించిన బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డులు అలాగే సంబంధిత గ్యాస్ ఏజెన్సీ పుస్తకం జత చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అంతేకాకుండా ఆయా పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు తల్లికి వందనం పథకాన్ని త్వరలోనే అమలు చేసేందుకు ధ్రువ పత్రాలను సమర్పించాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ నేపథ్యంలో గూడూరు మండలంలోని గూడూరు వన్ లో కేవలం ఒక్కరు మాత్రమే ఉదయం 11 గంటలకు విధులకు హాజరయ్యారు. కంకటావ లోని సచివాలయంలో 10:40 గంటలైనా ఉద్యోగులు ఎవరు విధులుగా హాజరు కాలేదు. కార్యాలయ స్వీపర్ మాత్రం కార్యాలయం శుభ్రపరిచి ఫ్యాన్లు, లైట్లు వేసి వెళ్లిపోయారు. అలాగే ఆకులమన్నాడు, తలకటూరు సచివాలయాల్లో ఇద్దరు ముగ్గురు సిబ్బంది మాత్రమే విధులకు హాజరు కాగా మిగిలినవారు డుమ్మా కొడుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. పెడన మండలంలోని ఉరివి, చెన్నూరు, చేవేంద్ర, కమలాపురం, నడుపూరు, ఉప్పల కలవకుంట పలు సచివాలయాల్లో విధులకు సమయపాలన లేకుండా వస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

దీనిపై గూడూరు ఎంపీడీవో రాజ్యలక్ష్మి వివరణ కోరగా బయోమెట్రిక్ హాజరు ద్వారా పరిశీలించి విధులకు గైహాజరవుతున్నారని తేలితే చర్యలు తీసుకుంటామన్నారు. పెడన మండలంలో విధులకు గైహాజు జరుగుతున్న విషయాన్ని ఇంచార్జ్ ఎంపీడీవో మద్దాల జయరాంను వివరణ నిమిత్తం చరవాణిలో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

గూడూరు మండలం కంకటావ గ్రామ సచివాలయంలో ఉదయం 11 గంటలైనా రాని సిబ్బంది



పెడన మండలం చెన్నూరు సచివాలయంలో సిబ్బంది లేని దృశ్యం

ఆధార్ కార్డు మార్పు కోసం తిరుగుతున్నా.
అంక అంజమ్మ ,గూడూరు

మూడేళ్ల క్రితం వరకు ఉద్యోగ నిమిత్తం మా అబ్బాయి తో పాటు హైదరాబాదులో ఉన్నాం. అయితే మళ్లీ మా సొంత గ్రామం అయినా గూడూరు వచ్చేసాం. ఆధార్ కార్డులో అడ్రస్ మార్చాలంటూ రెండేళు గా వద్ధ దంపతులమైన మేమిద్దరం తిరుగుతూనే ఉన్నాం. ఇంతవరకు నా సమస్య పరిష్కారం కాలేదు. అడ్రస్ సరి చేస్తే పింఛనుకు దరఖాస్తు చేసుకుంటాం.

మూడు రోజులుగా తిప్పిస్తున్నారు
ఉమ్మడిశెట్టి నాగ సుధా, గూడూరు మండలం తలకటూరు గ్రామ సచివాలయం.

తల్లికి వందనం పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ కార్డులో ఇంటిపేరు ఒక్క అక్షరం పొరపాటు పడింది. దీనిని సవరణ చేయడానికి తలకటూరు సచివాలయానికి వెళ్లాను. అక్కడ నుంచి గూడూరు సచివాలయం వన్‌కి వెళ్ళమన్నారు. అక్కడికి వెళ్లాను మార్చడం కుదరదు అన్నారు. ఎక్కడికి వెళ్ళినా మూడు రోజులుగా పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు.

దాళ్వా సాగుకు అనుమతివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-బంటుమిల్లి : ఈ సంవత్సరం రబీ పంటకు బంటుమిల్లి మెయిన్ కాలువ పరిధిలో దాళ్వా వరి సాగుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో బంటుమిల్లి, కత్తివెన్ను మండలాల రైతులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం కష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రాంతం సముద్ర తీర ప్రాంతం అవ్వడంవల్ల నాలుగు సంవత్సరాల నుంచి దాళ్వా వరిసాగుకు అనుమతి ఇవ్వకపోవడం వల్ల ఉప్పు శాతం పెరిగి దిగుబడులు తగ్గుతుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి మండల రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు మలిశెట్టి శివరాం ప్రసాద్, లంకదాసుల అజయ్ ఘోష్, రైతులు వెంట్రపాటి సురేష్, పుప్పాల సూర్యనారాయణ, జొన్నాల వీరేంద్ర, యర్రా రమేష్, పుప్పాల నరసింహారావు, మాజేటి శ్రీనివాసరావు, అబ్బూరి కిరణ్, జన్యావుల కన్నా రావు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి కలక్టరేట్(కృష్ణా) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని, జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

అన్నదానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మండలం లోని అంగలూరు గ్రామంలో త్రిపిరినేని అప్పారావు ఆర్థిక వితరణతో నిరు పేదలకు అన్నదాన కార్యక్ర మాన్ని నిర్వహించినట్లు లయ న్స్ క్లబ్ అధ్యక్షులు నిమ్మగడ్డ శశికళ తెలిపారు. లయన్స్ ప్రతినిధులు వైపీసీ ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలో వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానానికి ఆదివారం సంధర్భంగా చుట్టుప్రక్కల గ్రామముల నుండే కాకుండా సుదూర ప్రాంతముల నుండి యాత్రికులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పాలపొంగళ్ళు, పసుపు కుంకుమలు సమర్పించి వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులచే అన్నప్రాసనలు, వాహన పూజలు చేయించు కున్నారు. కొండలమ్మ అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలుకలగకుండా గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించారు. శ్రీ అమ్మవారిని సుమారు10 వేల మంది పైగా భక్తులు దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు.

సమాచార కేంద్రం ఏర్పాటు :కొండలమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద సమాచార కేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశాల మేరకు యాత్రికుల సౌకర్యార్థం శ్రీ కొండాలమ్మ వారి దేవస్థానం వద్ద సమాచార కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సమాచార కేంద్రం ఏర్పాటు చేసిన దృశ్యం

పర్యాటలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

హంసలదీవికి పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి-కోడూరు : హంసలదీవి సముద్ర తీరానికి వచ్చే పర్యాటకులు జాగ్రత్తలు పాటించాలని తీర ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, ఎవరైనా మద్యం సీసాలు పట్టుకొచ్చిన అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పాలకాయతిప్ప మెరైన్ సీఐ సురేష్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం సముద్ర తీరానికి వచ్చే పర్యాటకులు సముద్ర స్నానాలు ఆచరించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి సిఐ సురేష్ రెడ్డి వివరించారు. ప్రసిద్ధ పర్యాటక ప్రాంతంగా ఈ ప్రాంతానికి మంచి ప్రాముఖ్యత ఉందని, కార్తీక మాసం సందర్భంగా వచ్చే భక్తులు సముద్రం లోతుకి వెళ్లకుండా స్నానాలు ఆచరించాలని కోరారు. మెరైన్ పోలీసులతో పాటు స్థానిక కోడూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

సభ్యత్వం తీసుకుంటున్న మంత్రి కొల్లు దంపతులు

కంకిపాడు మండలంలో సభ్యత్వం తీసుకుంటున్న దృశ్యం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కష్ణా జిల్లా మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం మంత్రి కొల్లు రవీంద్ర,నీలిమా దంపతులు, ఆర్ టి సి ఛైర్మెన్ కొనకళ్ల నారాయణరావు, సీనియర్ తెలుగుదేశం నాయకులు గోపిచెంద్ ఆధ్వర్యంలో మంత్రి లక్ష రూపాయల రుసుము చెల్లించి శాశ్వత సభ్యత్వం నమోదు చేసుకున్నారు. అనంతరం రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ 1989 లో మొదట సభ్యత్వం తీసుకున్న దగ్గరనుండి పార్టీకి కట్టుబడి ఉన్నానన్నారు. ఒక సాధారణ కార్యకర్త నుండి క్రియ శిలకార్యకర్త గా డివిజన్ కి ఇంచార్జ్ గా జిల్లా తెలుగు యువత అధ్యక్షులు గా వివిధ హెూదాల్లో పని చేశానని గుర్తు చేశారు. ఎప్పుడు ఎన్నికలు జరిగిన తెలుగు దేశంపార్టీ గెలుపుకు కష్టపడి పని చేశానన్నారు. తన ఊపిరి ఉన్నంత వరకూ తెలుగుదేశం పార్టీ కి కట్టుపడి ఉంటానని, మచిలీపట్నం నియోజకవర్గ ప్రజలకు వారి అభివద్ధికి అహర్నిశలు సేవ చేస్తూనే ఉంటానన్నారు.

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికష్ణ మాట్లాడుతూ కేవలం 100 రూపాయల రుసుముతో టిడిపి సభ్యత్వం తీసుకోవడం వలన రెండు సంవత్సరాల పాటు ఐదు లక్షల రూపాయలు బీమా సౌకర్యం కల్పించబడుతుందన్నారు. అలాగే సభ్యత్వం ఉన్న వ్యక్తి మరణించినట్లయితే మట్టి ఖర్చుల నిమిత్తం వెంటనే పది వేల రూపాయలు కుటుంబ సభ్యులకు చెల్లిస్తార నితెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు చలువాది రాజ గురవయ్య, యూనిట్ ఇంచార్జ్ పులి శ్రీనివాసరావు , బూత్ ఇన్చార్జ్ కొండా నాగేశ్వరరావు, వరిపి సత్యబాబు, దండుగుల శివనాగరాజు, దండుగుల రమణ, పీట్ల మంగమ్మ పాల్గొన్నారు .

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-చల్లపల్లి : స్థానిక పడమర వీధిలో చల్లపల్లి-అవనిగడ్డ ప్రధాన రహదారి పక్కన విలువైన ప్రభుత్వ భూమిని నిర్భయంగా కబ్జా చేసి పక్కా నిర్మాణం చేపడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై చల్లపల్లి గ్రామస్తులు మండిప డుతున్నారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి పేరుతో దేశవ్యాప్తంగా పేరు గాంచిన చల్లపల్లి గ్రామ పంచాయతీ పాలకులు, అధికార గణం స్పందించకపోవడం దారుణం. ఇటీవల కబ్జా నిర్మాణ ప్రారంభదశలో అడ్డుకున్న పంచాయతీ అధికారులు ఇప్పుడు ముఖం చాటేయడంలో మర్మమేమిటో ? మినీ పార్క్,అంగన్వాడీ నిర్మాణం కోసం పరిశీలించిన ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టి బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాల ని గ్రామస్తులు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణం చేపడుతున్న దృశ్యం

'ఐడియాస్'లో అన్నదానం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ఆర్టీసీ బస్సు స్టాండ్ సమీపంలోని ఐడియాస్ సేవా సంస్థలో ఆదివారం అన్నదాన కార్యక్రమం జరిగింది. పట్టణానికి చెందిన కొండ నాగ మల్లికార్జునరావు సుబ్బలక్ష్మి దంపతుల మనమరాలు సిరి సాహిత్య బార సాల సందర్భంగా ఐడియాస్‌లో ఆశ్రయం పొందుతున్న పేద పిల్లలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారి సిరి సాహిత్య తల్లిదండ్రులు గౌరీ, దుర్గా ప్రసన్న కుమార్, రేణుక, సంస్థ డైరెక్టర్ అవ్వారి శౌరి, ఐడియాస్ సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

దాములూరు రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండల దాములూరు నుండి కూడలి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు మార్గంలో గుంటలు పడి రాకపోకలు సాగించేందుకు వీలు లేకపోవడంతో ఆదివారం పొక్లెయిన్‌తో తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఈ రోడ్డులో ప్రయాణించే వాహనాలు ప్రమాదాలకు గురికావడం, వాహనాలు డామేజ్ కావడం జరుగుతుంది. కార్తీక మాసం ప్రారంభం అయినందున కూడలి వెళ్లే యాత్రికులు ఇబ్బంది పడుతున్నందున ఈ పరిస్థితులను గమనించిన స్థానిక టిడిపి నాయకుడు నెల్లూరి గోపీనాథ్, జనసేన నాయకుడు సాధం హనుమంతరావు, ఇరువురు చర్చించుకుని వారి సొంత ఖర్చులతో తాత్కాలికంగా గుంతలను సరిచేసి వాహనాలు వెళ్లేలా ఏర్పాటు చేశారు.

5 నుండి 15 వరకు గ్రామ సభలు

ప్రజాశక్తి - వత్సవాయి : ఈ నెల 5వ తేదీ నుండి 15వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ నరసింహారావు తెలిపారు. ఈ నెల 5న దేశ్‌పాలెం. ఆరో తేదీన చిన్న మోదుగు పల్లి, ఏడో తేదీన పోచవరం, 8న పెద్ద మోదుగు పల్లి, 11న గంగవల్లి, 12న చిట్యాల, హసనాబాదు 13న, వీరభద్రు పాలెం14న రెబ్బవరం, 15న వేమవరం గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సభలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి ఆదేశాల ప్రకారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు రీ సర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యలు, విస్తీర్ణంలో జాయింట్ ఎల్పిఎం, ఖాతా నెంబర్ తప్పుగా నమోదవడం మొదలగు వాటికి సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. మండలంలో వివిధ గ్రామాలలో గ్రామపంచాయతీ కార్యాలయాల్లో 9 గంటల నుండి గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు రైతుల హాజరు కావలసిందిగా కోరారు.

ఆగని ఇసుక మాఫియా ఆగడాలు

అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తున్న ఉచిత ఇసుక పథకం

ప్రజాశక్తి కంచికచర్ల : జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఇసుక మాఫియా పేట్రేగిపోతోంది. కొంతమంది ప్రజా ప్రతినిధుల పేరుతో వారి అనుచరులు చేసే ఇసుక దోపిడీ ఆగడాలను నిరోధించలేకపోతున్నారు. ఇసుక అక్రమార్కులకు అధికార పార్టీ ప్రజా ప్రతినిధులే కొమ్ముకాస్తున్నారనే విమర్శలు బలంగా వినపడుతున్నాయి. ఇసుక అక్రమ రవాణాలో అధికార పార్టీలోని జిల్లా, నియోకవర్గ స్థాయి నాయకుల అనుచరులు గ్రూపులుగా విడిపోయారు. దీంతో ఇసుక వ్యాపారంలో తమదంటే, తమదే పైచేయి కావాలనే ఆధిపత్యం కోసం అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పోటీ పడుతున్నట్లు ఆ పార్టీ కార్యకర్తలే చెబుతున్నారు. ఇటీవల నందిగామ నియోకవర్గంలోని పెండ్యాల ఇసుక రీచ్‌లో అధికార పార్టీ ప్రజాప్రతినిధి పేరుతో ఆయన అనుయాయులు రాత్రి సమయంలో జెసిబితో ఇసుక లారీలకు లోడు చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్న విషయం తెలిసిందే.

పెండ్యాల క్వారీ ప్రారంభించకుండానే తన ప్రమేయం లేకుండా ఇసుక తవ్వకాలు జరిపిన వారిని గుర్తించి, చర్యలు తీసుకోవాలని పెండ్యాల రీచ్ గుత్తేదారుడు మైనింగ్, పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అక్టోబర్ చివరి వారంలో పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు పరిధిలో మునేటి నుండి భారీ ఎస్కవేటర్లతో భారీ లారీలకు ఎలాంటి అనుమతులు లేకైండా ఇసుక లోడింగ్ చేసిన లారీలను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఆ లారీలు జిల్లాకు చెందిన అధికార పార్టీ ప్రజాప్రతినిధి చెందినవి అని చెప్పినా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీనికి ముందు ఈ ఏడాది



ఇసుక లోడింగ్‌కు వెళ్తున్న జెసిబి

ఆగస్టులో కంచికచర్ల మండలంలోని మోగులూరు, కీసర ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద నుండి జిల్లా, స్థానిక నాయకులు అనుమతులు లేకుండా తోలుకుని జేబులు నింపుకున్న

నాలుగు రోజుల క్రితం జగ్గయ్యపేట నియోకవర్గం అనిగండ్లపాడులో పట్టుబడిన లారీ

విషయం తెలిసిందే. ఇప్పటికీ ప్రతిరోజు నందిగామ, జగ్గయ్యపేట నియోకవర్గాల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతూనే ఉంది. ఈ ప్రాంతంలో జరిగే ఇసుక అక్రమ రవాణాలో ప్రజా ప్రతినిధులే గ్రూపులుగా విడి పోయి ఆధిపత్యం కోసం పోటీ పడటంతో రానున్న రోజుల్లో నాయకుల మధ్య ఆధిపత్య పోరు శాంతి భద్రతలకు కూడా విఘాతం కలిగించే అవకాశం ఉందని సామాన్య ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ భగవాన్ సత్యసాయి మందిరంలో జిల్లా అంధత్వ నివారణే లక్ష్యంగా శంకర్ ఐ హాస్పిటల్ సహకారంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఎంఎల్ఎ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ సేవలందిస్తున్న సత్యసాయి కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. నందిగామ భగవాన్ సత్యసాయి కమిటీ చైర్మన్ యు.వాసుదేవరావు, కౌన్సిలర్ శాకమూరు స్వర్ణలత, టిడిపి నాయకులు ఏపూరి నాగేశ్వరరావు, శ్రీనివాసాచారి, కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలో వివిధ గ్రామాలకు చెందిన వారికి స్థానిక రూ.8.3లక్షలు సిఎంఆర్‌ఎఫ్ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య రూ.80,3,594లను ఆదివారం పట్టణంలోని రాజగోపాల్ స్వగృహంలో అందజేశారు. చిల్లకల్లు గ్రామానికి చెందిన షేక్ జరీనా బేగం 50,524, రావిరాల గ్రామానికి చెందిన ఇనపనూర్తి నాని బాబు రూ.45వేలు, బలుసుపాడు గ్రామానికి చెందిన తేజవతు నాగేశ్వరరావు రూ.20వేలు, తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన గొల్లపూడి లక్ష్మి రూ.88,515, బండిపాలెం గ్రామానికి చెందిన షేక్ ననేబి 37,100, గౌరవరం గ్రామానికి చెందిన మాదారపు కృష్ణమ్మ 30,786, బండిపాలెం గ్రామానికి చెందిన జవ్వాజి గురవయ్య రూ.40వేలు, బండిపాలెం గ్రామానికి చెందిన నెమలి రత్నకుమారి రూ.20వేలు గౌరవరం గ్రామానికి చెందిన అరికట్ల శివ రూ.50 వేలు, బండిపాలెం గ్రామానికి చెందిన వడెంపూడి స్వరూపారాణి 25,655, బండిపాలెం గ్రామానికి చెందిన నెమలి ప్రభు 32,255, షేర్ మహమ్మద్ పేట గ్రామానికి చెందిన షేక్ బాజీ బాబా 21,825, గండ్రాయి గ్రామానికి చెందిన వైకుంఠపు వెంకటరావు 38,727, గౌరవరం గ్రామానికి చెందిన గుంజి నాగేశ్వరరావు రూ.30వేలు, బండిపాలెం గ్రామానికి చెందిన జెట్టి సుజాత 23,400, తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన బాణావతి ధార్మిక శ్రీనిధ్ రూ.15వేలు, షేర్ మహమ్మద్ పేట గ్రామానికి చెందిన చల్ల వర్షిత 25,000, పోచంపల్లి గ్రామానికి చెందిన దొప్ప కొండ 30,786, గౌరవరం గ్రామానికి చెందిన ఉమ్మారెడ్డి శ్రీనివాసరావు 25,000, షేర్ మహమ్మద్ పేట గ్రామానికి చెందిన పల్లెబోయిన న వెంకటరమణ 52,809, గండ్రాయి గ్రామానికి చెందిన చేపూరి శ్రీ స్వప్న 55,000, అనుమంచిపల్లి గ్రామానికి చెందిన శ్రీవిద్య 26,218, మల్కాపురం గ్రామానికి చెందిన అంబోజి ఏసు రూ.20 వేలు వారికి వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను 24 కుటుంబాలకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, తక్కెళ్ళపాడు సర్పంచ్ కసుకుర్తి శ్రీనివాసరావు, వివిధ గ్రామాల టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం పేరకలపాడు గ్రామంలో ఆదివారం టిడిపి సభ్యత నమోదు కార్యక్రమాన్ని మండల టిడిపి అధ్యక్షులు కోగంటి బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కార్యకర్తకు ప్రమాద భీమా అమలుచేసిన పార్టీ టిడీపియే అన్నారు.. కేవలం వంద రూపాయలు చెల్లించడం ద్వారా 5 లక్షల ప్రమాద భీమా వర్తిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మన్నె సాత్విక గ్రామ పార్టీ అధ్యక్షులు కనగాల వాసు ,గద్దె మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

500 గోవులకు గ్రాసం విరాళం

జగ్గయ్యపేట: జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు, మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సతీమణి, సామినేని విమల భాను ఫౌండేషన్ ఛైర్మన్ సామినేని విమల భాను జన్మదిన సందర్భంగా ప్రముఖ పుణ్య క్షేత్రమైన వేదాద్రి నందు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనతరం వేదాద్రి లో గల ఎస్ వై ఎల్ ఎన్ ఏస్ సేవ ట్రస్ట్ వారు నిర్వహించే గోశాలను సందర్శించి అక్కడ శివాలయం నందు పూజలో పాల్గొని, గో మాతకు ప్రత్యక పూజలు నిర్వహించారు. 500 గోవులకు సంవత్సర గ్రాసం విరాళముగా అందజేశారు. గోశాల నిర్వాహకులను ప్రత్యేకముగా శాలువాతో సత్కరించి అభినదించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పెడనకు నిధుల కేటాయించేనా...?

ప్రజాశక్తి-పెడన : కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా పెడన పురపాలక సంఘ పనితీరు తయారైంది. గత ప్రభుత్వంలో నిధులు వెచ్చించకపోవడంతో అభివద్ధికి ఆ మడ దూరంలో ఉందన్న ఓటర్లు కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. ఐదు నెలల గడిచిన ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించక పోవడంతో పురపాలక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేసేది లేక డిఎఫ్ఎం ఫండ్స్ నుంచి ఎన్నికల ముందు చేసిన వాటిని నిర్వహించామని సోమవారం జిల్లా ఇంచార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్ కు చూపించున్నారు.

పెడన పురపాల సంఘం పరిధిలో అభివద్ధి కుంటుపడింది. మున్సిపల్ జనరల్ ఫండ్స్ అలాగే రాష్ట్ర నిధులు ఎస్ డి ఎఫ్, 15 ఫైనాన్స్ పలు శాఖల నుంచి గత ఐదున్నరలుగా నిధులు కేటాయించలేదు. అంతేకాకుండా స్టాంప్ డ్యూటీ నుంచి ఏడాదికి కోటి రూపాయలు నిధులు విడుదల చేయాల్సి ఉండగా కేవలం 50 లక్షలు మాత్రమే అది కూడా రెండు దఫాలుగా సమకూర్చింది. అంతేకాకుండా ఎన్నికల ముందు డిఎఫ్ఎం నిధుల నుంచి జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు మేరకు 40 లక్షల విడుదల చేసింది. వీటితో

పెడన పురపాలక సంఘం

పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు అలాగే ఫిల్టర్ బెడ్లను నిర్మాణం, పిచ్చి మొక్కలు, చెట్టు తొలగింపు కార్యక్రమాలను మాత్రమే చేశారు. దీంతో అభివద్ధి అంతంత మాత్రమే జరిగింది. ఐదు నెలల క్రితం జరిగిన సార్వత్ర ఎన్నికల్లో ప్రజలు కూటమికి సానుకూలంగా పనిచేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా మున్సిపాలిటీకి నిధులు కేటాయించి అభివద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. కానీ నేటికీ ఒక రూపాయి కూడా నిధులు విడుదల చేయకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు.

పాత వాటిని చూపిస్తున్నారు : సోమవారం కృష్ణా జిల్లా పరిషత్ సమావేశం కార్యాలయంలో ఇన్చార్జి మంత్రి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించనున్నారు. కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివద్ధిని, చేయాల్సిన పనులను సమర్పించాలని జిల్లా కలెక్టర్ బాలాజీ మున్సిపల్ అధికారులకు శనివారం ఆదేశాలు జారీ చేశారు. అయితే నిధులు లేక గత ఐదు ఏళ్ళుగా పనులు జరగలేదని ఎన్నికల ముందు విడుదల చేసిన డిఎఫ్ఎం నుంచి కేటాయించిన 40 లక్షల రూపాయలు పనులనే ఇన్చార్జి మంత్రి ముందు పెట్టనున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఎమ్మెల్యే కాగిత కష్ణ ప్రసాద్ మున్సిపల్ అధికారులు పట్టణాన్ని అభివద్ధి నిమిత్తం నిధులు మంజూరు చేయాలని కోరతారో లేదా అన్నది వేచి చూడాల్సిందే. దీనిపై మున్సిపల్ కమిషనర్ గోపాలరావును వివరణ కోరగా నివేదికను సిద్ధం చేశామని, ఉన్నతాధికారులకు సమర్పిస్తామని చెప్పారు. ఇటీవల మున్సిపాలిటీకి అభివద్ధి నిమిత్తం నిధులు విడుదల కాలేదని అన్నారు. ఎన్నికల ముందు కేటాయించిన నిధుల్ని సమకూర్చామని. స్టాంప్ డ్యూటీ నిధులు కూడా ఇటీవలనే విడుదల చేశారని చెప్పారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

540 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు పల్లెల్లో కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారు. ఆదివారం జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన 540 మందికి గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రోఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న రోగులకు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు, నేత్ర సమస్యలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్లు కణితి శశిరేఖ హనుమకొండ దుర్గ భవాని, గుండె, ఊపిరితిత్తుల సమస్యలకు విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులు ఎస్.దాశరథి, లింగం శెట్టి వర్ధన్, సాధారణ వైద్యానికి గుడివాడ హోమియో వైద్యులు పి భవాని, తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం అవసరమైన రోగులకు డాక్టర్ సి ఎల్ వెంకటరావు చేతుల మీదుగా ఉచిత మందులను పంపిణీ చేశారు.

వైసిపి జిల్లా అధ్యక్షునిగా దేవినేని అవినాష్

ప్రజాశక్తి-విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులుగా దేవినేని అవినాష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అవినాష్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని కష్టాలు తెచ్చినా రానున్న 2029 ఎన్నికల్లో వైసిపి గెలుపే ధ్యేయంగా పని చేయడం జరుగుతుందని అన్నారు. ఈ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో జెండాను ఎగురవేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వల్ల వైసిపి నేతలు, కార్యకర్తలకు ఏ ఇబ్బందులు వచ్చినా... వైసిపిలోని ప్రతి ఒక్క నాయకుడు, మీ దగ్గరకొచ్చి అండగా నిలుస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏమి చేయలేక ... మన నాయకులపై కేసులు పెట్టడమే పనిగా పెట్టుకుందని అన్నారు. పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో లీగల్‌గా కేసులను అడ్డుకుంటామని పేర్కొన్నారు. మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ...ఎన్‌టిఆర్ జిల్లా పార్టీ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన దేవినేని అవినాష్‌కు ఈ జిల్లాలోని ప్రతి నాయకుడు అండగా నిలిచి సహకారం అందించాలని కోరారు. అధికారం ఉన్నా లేకపోయినా వైసిపి నాయకులు పోరాడే తత్వం కలవారని తెలిపారు. డిప్యూటీ సిఎం, జనసేన అధినేత వ్యవహారశైలితో ఆపార్టీ శ్రేణులు తీవ్ర మనోవ్యాధనతో కుంగిపోతున్నారని,టిడిపి చేస్తున్న వ్యవహారాలకు జనసేన కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. అధికారం మత్తులో పవన్ కళ్యాణ్ తిరుగుతున్నారని అన్నారు. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ...పాలనా పరంగా అతి తక్కువ కాలంలోనే కూటమి ప్రభుత్వం విఫలమయిందని అన్నారు. రానున్న కాలంలో పార్టీ అభివృద్ధికి దేవినేని అవినాష్ నేతృత్వంలో ఈ జిల్లాలోని నాయకులు కలిసికట్టుగా పని చేయాలని కోరారు. పార్టీ నాయకులు వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, తలశిలరఘురామ్, నల్లగట్ల స్వామిదాస్, జగన్మోహన్ రావు, పి గౌతంరెడ్డి, ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

డ్రెయినేజీల్లో పారని మురుగు

- దుర్వాసనతో స్థానికుల ఇబ్బందులు

రాయనగర్‌లో రోడ్లపై పారుతున్న మురుగు

ప్రజాశక్తి- గన్నవరం : ఏ గ్రామంలో చూసినా ఏమున్నది గర్వకారణం... పారని మురుగు కాల్వ లు.. చెత్తా, చెదారం వేయడంతో కుళ్లి కంపు కొడుతున్న డ్రైనేజీలు.. పూడిపోయిన తూములతో రోడ్డు మీదకు వస్తోన్న మురుగు నీరు.. దోమలు, పందుల స్వైర విహారాలు.. ప్రజలకు అంటురోగాలు.. ఇవీ గ్రామాల్లో కనిపిస్తున్న ప్రధాన సమస్యలు. నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం, విమానాశ్రయానికి కేంద్రమైన కేసరపల్లి, రైల్వే స్టేషన్లో కేంద్రమైన ముస్తాబాద, ఎన్‌టిటిపిఎస్ కేంద్రమైన బుద్దవరం పంచాయతీల్లో డ్రైనేజీలే పెద్ద సమస్యలు ఉన్నాయి. కోట్లాది రూపాయలతో సిమెంట్ రోడ్లు వేస్తున్నా.. డ్రైనేజీలు కట్టకుండా వదిలేస్తున్నారు. దీంతో ఇళ్లలో వాడిన నీరంతా బయటకొచ్చి మురుగు కాల్వల్లో నిలిచిపోతుంది. వాటిల్లో చెత్తా,చెదారం పారేయటంతో కుళ్లి పోయి దుర్వాసన వస్తోంది. దోమలు వద్ధి చెంది రోగాలు పంచుతున్నాయి. ప్రభుత్వం మాటలతో కాలం గడిపేస్తోంది. మురుగు సమస్యను కళ్లకు కట్టిన ట్లుగా కనపడుతున్నాయి. బుద్దవరం రోడ్డు తూము పూడి పోయి మురుగు నీరు నిలిచిపోయింది. వీనస్ ప్లేడ్లలో రోడ్డు మీదరు వస్తున్న మురుగుతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముగ్గురు బాలుర ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం కాలేఖాను పేట మంచినీటి కాలవ వార్పు దగ్గర అదృశ్యమైన ముగ్గురు పిల్లలను ఆదివారం నందివాడ మండలంలోని తమిరిస గ్రామంలో కనుగొన్నట్టు బందరు డిఎస్పీ అబ్బుల్ సుబాని తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డిఎస్పి విలేకరులకు వెల్లడించారు. తమ పిల్లలు ముగ్గురు తమ్ము నాగేశ్వరరావు, తమ్ము దుర్గారావు , తమ్ము శ్రీనివాసరావులు శుక్రవారం నుండి కనిపించడం లేదని వారి తండ్రి రాఘవులు శనివారం ఇనకుదురు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గత ఆరు నెలల క్రితం పిల్లల తల్లి మృతిచెందింది. ముగ్గురు పిల్లలను ఒక్కడే సాకుతున్న తండ్రి తమ్ము రాఘవులు గత నెల 30వ తేదీన పిల్లలను ఇంటి వద్ద వదిలి అవనిగడ్డలో ఉన్న తన తల్లి దగ్గరకు వెళ్లాడు. రెండు రోజులైనా తండ్రి ఇంటికి రాక పోవటంతో1వ తేదీన తండ్రిని వెతుక్కుంటూ పిల్లలు అవనిగడ్డ వెళ్లారు. జీలగలగండి వద్ద ముగ్గురు పిల్లలను ఆటో డ్రైవర్ అయ్యప్ప గమనించి ఆటో ఎక్కించుకున్నాడు.

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి అబ్దుల్ సుభానీ

నందివాడకు చెందిన తమ వివరాలు చెప్పకపోవటంతో తనతో పిల్లలను నందివాడకు తీసుకెళ్లిన ఆటో డ్రైవర్ తీసుకెళ్లాడు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో అదృశ్యమైన పిల్లల కోసం జిల్లా అంతటా పోలీసులు గాలించగా నందివాడలో ఉన్నట్లు సమాచారం రావటంతో పిల్లల్ని నందివాడ ఎస్ఐ కె శ్రీనివాసులు మచిలీపట్నం తీసుకొచ్చి తండ్రి చెంతకు పిల్లలను చేర్చారు. అదృశ్యమైన పిల్లలను కనిపెట్టి, సురక్షితంగా తీసుకొచ్చినందుకు పిల్లల తండ్రి ఎస్పీ గంగాధరరావు, పోలీస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం అందిస్తున్న మండలి వెంకట్రామ్

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండల పరిధిలోని వి.కొత్తపాలెం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సర్వస్వం కోల్పోయిన గోవాడ లక్ష్మీ కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ పరామర్శించారు. సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి బాధిత కుటుంబానికి రూ.ఐదు వేలు నగదు, దుప్పట్లు, నూతన వస్త్రాలు అందజేశారు. స్థానిక నాయకుడు రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని వెంకట్రామ్ చేతులమీదుగా అందచేశారు. బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని వెంకట్రామ్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి బాసు నాంచారయ్య నాయుడు, నాయకులు యలవర్తి వెంకన్న, రేపల్లె పిచ్చేశ్వరరావు, రేపల్లె రవి పాల్గొన్నారు.

'మీకోసం'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-విజయవాడ : సోమవారం కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) 'మీకోసం' కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ డా. నిధి మీనా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పిజిఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. జిల్లా కేంద్రంతో పాటు, డివిజన్, మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జ్ కలెక్టర్ డా. నిధి మీనా ఆ ప్రకటనలో కోరారు. అలాగే విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న మూడు జోనల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు, ప్రజలు ఉదయం పదిగంటల నుండి తమ ఫిర్యాదులను అందజేయొచ్చని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర కోరారు.

పత్తి కొనుగోలు కేంద్రాలు కరువు

తక్కువ ధరకు అమ్ముకుంటున్న రైతులు

పత్తిని దళారులు కొని వ్యాన్లో తరలిస్తున్న పత్తి (మైలవరం మార్కెట్ యార్డ్)

ప్రజాశక్తి - మైలవరం : పత్తి కొనుగోలు కేంద్రాలను సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో దళారులు రాజ్యమేలుతున్నారు. రైతులను ఆదుకోవటానికి అక్టోబర్ నెలాఖరు, నవంబర్ ప్రారంభంలోనే పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రతి ఏడాది ప్రారంభిస్తుంటారు. ఈ ఏడాది ప్రకటనలకే పరిమితం తప్ప కార్యరూపం దాల్చలేదు. పోటీ మార్కెట్ లేకపోవడంతో దళారి వ్యాపారులు ధరలను పెంచడం లేదు. దిగుబడులు తగ్గిన పెరగాల్సిన ధరలు తగ్గుతూ ఉండటంతో పత్తి రైతులు సీసీఐ కేంద్రాల కోసం ఎదురుచూస్తున్నారు. కేంద్రాల ఏర్పాటుతోనే లాభం చేకూరుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పత్తికి కనీస మద్దతు ధర కోసం భారత పత్తి సంస్థ (సిసిఐ) ప్రతి ఏడాది కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తుంది. మార్కెట్ యార్డుల్లో తెరిచే కేంద్రాలతో రైతులకు మద్దతు ధర లభిస్తుంది. సిసిఐ కేంద్రం ప్రారంభమైన వెంటనే గ్రామాల్లో కొనుగోలు చేసే వ్యాపారులు మద్దతు ధర కంటే అధికంగా చెల్లించి కొనుగోలు చేస్తుంటారు. దీంతో రైతులకు లాభసాటిగా మారుతుంది. ప్రస్తుతం పత్తి తీతలు ప్రారంభమైనప్పటికీ సిసిఐ ప్రకటనలకే పరిమితమైంది. గత నెల రోజులుగా మైలవరం నియోజకవర్గ పరిధిలోని మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం మండలాల్లో పత్తి తీతలు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో రైతులు ఆశాజనకమైన ధరల కోసం ఎదురుచూస్తున్నారు.

సిసిఐ కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

పివి ఆంజనేయులు.. రైతు సంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు.

పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలి. పత్తి చేతికి వచ్చే సమయానికి మద్దతు ధర లేకపోవడంతో మధ్య దళారులు రంగ ప్రవేశం చేసి అందిన కాడికి కొనుగోలు చేస్తున్నారు. రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు. దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలి.

క్వింటా 5వేల లోపే

అక్టోబరు నెలలో క్వింటా పత్తి ధర రూ 5.వేలు వెచ్చించి గ్రామాల్లోనే వ్యాపారులు కొనుగోలు చేశారు. సిసిఐ కేంద్రాల జాడ లేకపోవడంతో తేమ పేరుతో వ్యాపారులు కూడా ధరలు తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు. గతేడాది క్వింటా పత్తి 7 వేల నుంచి 8 వేల వరకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు చేశారు. రైతులకు పెట్టుబడితో పాటు గత ఏడాది పత్తి లాభసాటిగా మారింది. ప్రస్తుతం క్వింటా పత్తిని రూ.4,500 ఉంచి 5,200కు కొనుగోలు చేయటమే గగనంగా మారిందని రైతులంటున్నారు. ఈ ఏడాది తుపాన్ల ప్రభావంతో పత్తి ఎదుగుదలతో పాటు దిగుబడులు కూడా బాగా తగ్గుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది అంటున్నారు. ప్రభుత్వ మద్దతు ధర గత ఏడాది కంటే పెంచితే కొంతవరకైనా నష్టాన్ని నివారించవచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మైలవరం నియోజకవర్గంలో

మైలవరం నియోజకవర్గంలో సుమారు 20వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. గత 5, 6 సంవత్సరాల నుండి పత్తి దిగుబడితో పాటు ధరలు కూడా ఆశాజనకంగా ఉండటంతో పత్తి సాగు వైపు రైతులు మొగ్గుచూపారు. మైలవరం మండలంలో 4 వేలు, ఇబ్రహీంపట్నంలో 460, రెడ్డిగూడెంలో 8 వందలు, జి.కొండూరులో 4,500 ఎకరాలలో ఈ ఏడాది రైతులు పత్తి సాగు చేపట్టారు. వాతావరణం అనుకూలంగా ఉంటే ఎకరానికి 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వస్తుంది.

క్వింటాకు 9వేలు ఇవ్వాలి

వేమిరెడ్డి రామసుబ్బారెడ్డి. రైతు. మంగాపురం

ఈ ఏడాది ఎక్కువగా వరదలు రావడంతో పంట ఎదుగుదల లోపించి దిగుబడి బాగా తగ్గింది. ఐదు ఎకరాలు సాగు చేస్తున్నాను. ఎకరానికి 15 నుంచి 16 వేల వరకు పెట్టుబడి పెట్టాను. మద్దతు ధర లేకపోతే పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి. ప్రభుత్వం వెంటనే మద్దతు ధర రూ.9వేలు ప్రకటించాలి.

బ్యాడ్మింటన్‌లో కృష్ణాజిల్లాకు ప్రథమస్థానం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కొనసీమ – జిల్లా ములికిపురంలో జరిగిన రాష్ట్రస్థాయి బాలబాలికల అండర్ 14, అండర్ 17 బ్యాడ్మిటన్‌లో ఆటల పోటీలు జరిగాయి. అండర్ 17 బాలికల విభాగంలో ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఉమ్మడి జిల్లా టీంలో నాగార్జున స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న బి.కార్తిషను స్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపల్, స్టాఫ్, స్టూడెంట్స్, ఎంఎల్ఎ శ్రీరాం తాతయ్య సత్కరించారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విస్సన్నపేట : ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, డిఎస్‌సి అభ్యర్థుల కోసం తయారు చేయించిన సైకాలజీ స్టడీ మెటీరియల్‌ను విస్సన్నపేట యుటిఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ స్టడీ మెటీరియల్ డిఎస్‌సి పరీక్షకు సిద్ధం అవుతున్న వారికి ఉచితంగా అందచేసినట్లు అవసరమైన వారు యుటిఎఫ్ మండల నాయకులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి సి హెచ్ వి సూర్యనారాయణ జిల్లా కౌన్సిలర్ పి.రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షురాలు కె.చైతన్య, గౌరవ అధ్యక్షులు బి.వి.రామారావు మండల యుటిఎఫ్ నాయకులు సిహెచ్ చంటిబాబకే రంగ, వెంకటేశ్వరరావు ఈ నాగేశ్వరరావు డి రాంబాబు ఆర్ శ్రీనివాసరావు కే రాజశేఖర్ ఎం రమేష్ సిహెచ్ లక్ష్మయ్య కే శ్రీనివాసరావు బి ప్రసాద్ రావు డి శ్రీనివాసరావు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు విస్సంపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

340 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - విసన్నపేట : గుంటూరుకి చెందిన మాదారాజు కృష్ణ శివదీపు అను వ్యక్తి పిడిఎస్ బియ్యం 340 క్వింటాల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పిడిఎస్ డిటి డి.శివనాగరాజు తెలిపారు. సిజి 08 టిఎం 8172 అశోక్ లైలాండ్ లారీలో ఉంద్రాజవరం నుంచి ఖమ్మం తలిస్తుండగా జాయింట్ కలెక్టర్‌కి వచ్చిన సమాచారం మేరకు ఆయన ఆదేశానుసారం మార్గం మధ్యలో విస్సన్నపేట వద్ద పట్టుకున్నామని తెలిపారు. బియ్యం భద్రత నిమిత్తం సాయి మణికంత హనుమాన్ రైస్‌మిల్, తిరువూరులో భద్రపర్చినట్లు తెలిపారు. అనంతరం 6 (ఎ) కేసు నమోదు చేసినట్లు నాగరాజు తెలిపారు.

అమరావతిలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్

అవుట్ పేషెంట్ వైద్య విభాగం ప్రారంభం

వైద్య విభాగాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాజధాని అమరావతి ప్రాంతంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్ అవుట్ పేషెంట్ వైద్య విభాగం ప్రారంభించినట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు అన్నారు. వైద్య రంగంలో 36 సంవత్సరాల అనుభవం కలిగిన ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, విజయవాడలో మూడు శాఖలు, గుంటూరు, ఒంగోలులో రెండు శాఖలున్నాయన్నారు. ఏలూరు బ్రాంచ్‌తో కలిపి 925 పడకల సామర్థ్యం, 2,800 మంది సిబ్బంది, 200 మంది నిష్ణాతులైన స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులతో సేవలు అందిస్తోంది. 26 అవుట్ రీచ్ సెంటర్లను నిర్వహిస్తూ, అత్యున్నత నాణ్యతా ప్రమాణాల సంస్థ ఎన్.ఎ.బి.హెచ్ నిర్దేశించిన వైద్య ప్రమాణాలను పాటించి, కోస్టల్ కారిడార్ వైద్య పటంలో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకుందన్నారు. రాజధాని అమరావతి ప్రాంత ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు తాడేపల్లి సర్వీసు రోడ్డు వద్ద అవుట్ పేషెంట్ వైద్య విభాగాన్ని ప్రారంభించా మన్నారు. ఈ సెంటర్‌లో ఫార్మసీ, లేబొరేటరీ, ఎక్స్ రే, ఈసీజీ, ఎకో కార్డియోగ్రామ్, ట్రెడ్ మిల్ టెస్ట్, అల్ట్రాసౌండ్ స్కానింగ్, టెలి మెడిసిన్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 5జీ టెక్నాలజీతో కూడిన ఐసియు ఆన్ వీల్స్ అంబులెన్స్ ద్వారా అత్యవసర వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కేంద్రంలో అన్ని రకాల మాస్టర్ హెల్త్ చెకప్‌లు, స్పెషలిస్ట్ కన్సల్టేషన్‌లు, ఇంటి వద్ద నుండే ల్యాబ్ శాంపిల్ సేకరణ, ఇంటివద్దకే మందులు అందించే సదుపాయాలు ఉన్నాయన్నారు. ప్రతి మంగళవారం ఉచితంగా వైద్య నిపుణుల కన్సల్టేషన్ కూడా అందుబాటులో ఉంటుందని డాక్టర్. రమేష్ బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చైర్మన్ మద్దిపాటి సీతా రామమోహనరావు, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, గ్రూప్ బిజినెస్ హెడ్ డాక్టర్ వై.కార్తీక్ చౌదరి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ నాదెళ్ల గిరిబాబు, యూనిట్ హెడ్స్ డాక్టర్ కారుపాటి సుదర్శన్, డాక్టర్ సుమ, డాక్టర్ నితిన్, ఇతర వైద్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

దొంగల బారిన పడకుండా అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ : ఇళ్ళలో దొంగతనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నగరంలో అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. క్రైమ్ డిసిపి కె.తిరుమలేశ్వర రెడ్డి, ఎడిసిపి ఎం.రాజారావు పర్యవేక్షణలో సిసిఎస్ ఇన్‌స్పెక్టర్లు వారి సిబ్బందితో కలిసి నగరంలోని ముఖ్య ప్రదేశాల్లో, అపార్ట్‌మెంట్లలోని ప్రజలకు దొంగతనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సెంట్రల్ జోన్ పరిధిలో గుణదల పోలీస్ స్టేషన్, రామవరపాడు రింగ్ సమీపంలోని అమరావతి గ్రాండ్ అపార్ట్‌మెంట్‌లో సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో, నార్త్ డివిజన్ సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్యనారాయణపురంలో నార్త్ జోన్ సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సదరు ఏరియాల్లో నివసిస్తున్న ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి, పోలీసు అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. దొంగతనాలు ఏవిధంగా జరుగుతాయి, నేరాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, పహారా గురించి, డయల్ 100, 112, 1930, ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ వల్ల కలిగే ఉపయోగాల గురించి, సైబర్ క్రైమ్ నేరాలు ఎలా జరుగుతాయి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్లు సమావేశంలోని ప్రజలతో మాట్లాడుతూ ఊరు వెళ్ళే సమయంలో తప్పనిసరిగా లోకల్ పోలీస్ వారికి సమాచారం అందించాలని, ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను ఉపయోగించుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్ల పరిసరాలను పరిశీలించి చుట్టూ లైటింగ్ పెంచుకోవాలని, సెక్యూరిటీ పరంగా సి.సి.కెమెరాలను, వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేసుకోవాలని, సదరు వాచ్‌మెన్లు అపార్ట్‌మెంట్ వద్దకు రాత్రి సమయంలోనే కాకుండా పగటి సమయంలో ఎవరు వచ్చిన వారిని ఎవరు ఎందుకు వచ్చారు అని ప్రశ్నించేలా తగు సూచనలివ్వాలని ఈ విధంగా అప్రమత్తంగా ఉంటూ దొంగతనాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.